ప్రజాశక్తి

ఆదివారం 16 జూన్ 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

వైసిపి నేత కార్యాలయంపై దాడి హేయం

మాజీ ఎంఎల్‌ఎ జగన్మోహనరావు



ధ్వంసమైన కిటికీ అద్దాలు, పరామర్శిస్తున్న జగన్మోహనరావు (కింద)



ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలోని వైసిపి నాయకుడు వేమా సురేష్ బాబు కార్యాలయంపై శుక్రవారం అర్ధరాత్రి రాళ్ళు, కోడిగుడ్లతో దాడి జరగడాన్ని పలువురు ఖండించారు. ఈ దాడి హేయమన్నారు. దాడి విషయం తెలుసుకున్న నందిగామ మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు శనివారం వేమా సురేష్‌ను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సహేతుకుం కాదన్నారు. పోలీసులు బాధ్యులను గుర్తించి కేసు నమోదు చేసి తగిన ఛర్యలు తీసుకోవాలని కోరారు. సురేష్‌ను పలువురు వైసిపి నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. సురేష్‌ను అంతం చేసేందుకే అల్లరి మూకలు అర్ధరాత్రి సమయంలో కార్యాలయంపై దాడి చేశాయని వైసిపి కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. దుండగుల దాడిలో కారు అద్దాలు, కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. 9 మంది వ్యక్తులు మద్యం మత్తులో రాళ్ల, కోడిగుడ్లు, సీసాలు విసురుతూ హల్‌చల్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది. (ప్రధాన వార్త మెయిన్ పేజీలో)



విజయవాడ గవర్నరుపేటలో ముఠా కార్మిక నేత సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సీతారాములు, దుర్గారావు, ముఠా కార్మికులు

వార్త 6లో

సుబ్బారెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలి

విమానాశ్రయం అభివృద్ధిపై ఆశలు !



తాత్కాలిక టెర్మినల్ భవనం

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుపై బాధ్యత

ప్రజాశక్తి - గన్నవరం : ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు తలమానికం గన్నవరం విమానాశ్రయం. గత కొన్నేళ్లుగా దీని విస్తరణ, టెర్మినల్ భవనం పనులు, కార్గో సర్వీసులు, ఇతర ప్రాంతాలకు అనుసంధానం వంటి విషయంలో ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం కరువైంది. తాజాగా కేంద్రంలో మూడోదఫా మోడీ సర్కారు కొలువుదీరడం, కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా తెలుగువ్యక్తి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు నియమితులుకావడం, మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి చెందుతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి. మరిన్ని కొత్త విమానాలు కూడా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పదిహేనేళ్ల క్రితం వరకు ఇక్కడికి విఐపిలు వచ్చినప్పుడు మాత్రమే విమానాలు, చాపర్లు వచ్చి వెళ్లేవి. ఆ తరువాత విమాన సర్వీసులు ప్రారంభం కావడంతో అభివద్ధికి బాటలు పడ్డాయి. కొత్త టెర్మినల్ భవనం, రన్వేను విస్తరించడంతో రాత్రి సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ స్థాయిలో సర్వీసుల రాకపోకలకు అనుకూలంగా రన్‌వేను తీర్చిదిద్దారు. రెండుగా మొదలైన విమాన సర్వీసులు 40కి పైగా పెరిగాయి. ప్రయాణికుల సంఖ్య లక్షల్లోకి పెరిగింది. నాలుగో గ్రేడులో ఉన్న విమానాశ్రయం రెండో గ్రేడులోకి మార్పు చెందింది. వైసిపి ప్రభుత్వ కాలంలో దీనికి బ్రేక్ పడింది. నాలుగేళ్ల క్రితం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. రూ.500 కోట్లతో నూతన టెర్మినల్ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఒకేసారి 2,400 మంది ప్రయాణీకులు రాకపోకలు సాగించేలా 20 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంతో భవన నిర్మాణానికి పచ్చజెండా ఊపినా పూర్తి కాలేదు. బోయింగ్ వంటి పెద్ద విమానాల రాకపోకల కోసం 1,750 మీటర్లు ఉన్న రన్వేను అయిదేళ్ల క్రితమే 3,565 మీటర్లకు విస్తరించారు. 72 మంది ప్రయాణీకులు పట్టేలా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు మాత్రమే సర్వీసులు పరిమితమయ్యాయి. పెద్ద విమానాలకు మార్గం సుగమం చేసి.. తిరుపతి, షిర్డీ, వైజాగ్, దుబాయ్, ముంబాయి, ఢిల్లీ నగరాలకూ విమాన (మిగతా 2లో)

అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు : ఎంపి బాలశౌరి

అంతర్జాతీయ స్థాయిలో గన్నవరానికి మరింత గుర్తింపు రానుందని కృష్ణాజిల్లా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. విజయవాడ-ముంబై విమాన సర్వీస్‌ను మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కలిసి గన్నవరం విమానాశ్రయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ఎయిర్ పోర్ట్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో గతంలో పలుమార్లు విజయవాడ నుంచి ముంబై నగరానికి విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రిని, అధికారులను కలిసినట్లు చెప్పారు. ఈ మేరకు తాజాగా (మిగతా 2లో)



జెండా ఊపి ముంబయి విమానాన్ని ప్రారంభిస్తున్న ఎంపి వి.బాలశౌరి

పెట్టుబడి సాయం అందేనా?

- కౌలు రైతులకు నామమాత్రమే
- కూటమి ప్రభుత్వ రూ.20 వేల హామీ ఏమవుతుందో !

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

వ్యవసాయ పెట్టుబడులు ఏటా పెరిగిపోతున్నాయి. ట్రాక్టర్ల కిరాయిలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్నింటికీ వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వాలు అందిస్తున్న పంట పెట్టుబడి సాయం ఒకింత ఊరట ఇస్తోంది. గత ప్రభుత్వం హయాంలో వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద రూ.7,500ను పిఎం కిసాన్ రూ.6 వేలతో కలిపి ఒక్కో రైతుకు సగటున

గత ప్రభుత్వ హయాంలో విడుదలైన వైఎస్‌ఆర్ రైతు భరోసా

సంవత్సరం	రైతుల సంఖ్య	మొత్తం రూ.కోట్లలో
2019-20	1,44,234	111.98
2020-21	1,50,487	116.97
2021-22	1,43,707	111.40
2022-23	1,51,505	120.70
2023-24	1,58,302	124.78
ఐదేళ్లలో మొత్తం	0000000	585.83



రూ.13,500 అందాయి. అయితే జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నామమాత్రంగానే వైఎస్‌ఆర్ రైతు భరోసా విడుదల చేసింది. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకూ రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈనేపథ్యంలో హామీ ఇచ్చిన విధంగా పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుందా? అందిస్తే ఎప్పుడు నుండి ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అంతేగాక వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు ఏ మేరకు సాయం అందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

కృష్ణాజిల్లాలో సగటున 4.23 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నాయి. 2.25 లక్షల మంది కౌలు రైతులు 2.75 లక్షల ఎకరాల్లో పంటలను సాగుచేస్తున్నారు. కౌలు రైతులకు పిఎం కిసాన్ అందించడం లేదు. గత ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకుంటున్నామని చెపుతూనే వారిని నిర్లక్ష్యం చేసింది. 2023-24 వ్యవసాయ సీజన్లో గత ప్రభుత్వ హయాంలో వైఎస్‌ఆర్ రైతు భరోసా కేవలం 7,601 మందికి రూ.5.70 కోట్లు మాత్రమే అందించింది.

ఎప్పుడిస్తారు ? ఎంత పెంచుతారు ?

వైసిపి ప్రభుత్వ హయాంలో (మిగతా 2లో)

డెల్టాలో సాగు మరింత ఆలస్యం!

- ఇంకా నాట్లు పడని దుస్థితి
- కాల్వలకు వదలని నీరు

ప్రజాశక్తి- గన్నవరం : ఈ ఏడాది ఖరీఫ్ భాగంగా డెల్టాలో సాగు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. ఏటా జూన్లో ఆరంభం కావాల్సిన నాట్లు ప్రక్రియ ఆగస్టులో మొదలవుతోంది. ఈ సమయానికి 50 శాతం పూర్తి కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం నాట్లు పడలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏలూరు కాలువకు నీరు వదలని కారణంగా డెల్టా రైతుల సాగు వెతలు వర్ణాతీతంగా మారాయి. ఏనాడు లేనివిధంగా ఈసారి నీరు అందక నాట్లు పడతాయా ? లేదా? అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బోర్ల నీటిని మళ్లిస్తున్నారు. ఇందుకుగాను అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది. గన్నవరం మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం, కేసరపల్లి, అజ్జంపూడి, జక్కులనెక్కలం, సావరగూడెం, అప్పారావుపేట, బుద్ధవరం, బూతిమిల్లిపాడు గ్రామాలు డెల్టా కింద ఉన్నాయి. వీటిలో 7,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. కాలువలకు నీరు వస్తే వెంటనే పనులు చేపడతారు. ప్రతికూల వాతావరణం వల్ల నాట్లు ప్రక్రియ నెల రోజులు ఆలస్యమవుతోంది. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 100 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. వర్షాలు పడితే మొత్తంగా వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నీటి కొరతతో ఆయిల్ ఇంజన్లు వాగుల్లో పెట్టి పొలాలకు నీరు పెడుతున్నారు. తర్వాత నాట్లు వేస్తున్నారు. బుద్ధవరం, కేసరపల్లి, దావాజీగూడెం, అజ్జంపూడి గ్రామాల్లో మాగాణి భూములు దుక్కులు దున్ని ఖాళీగా దర్శినమిస్తున్నాయి. నీరు లేకపోవడంతో నాట్లు పడటం లేదు. కొందరు ఇంజన్లతో నీటిని పొలాలకు తరలిస్తున్నారు. అందులో ఉన్న నారును కూడా తొక్కిస్తున్న పరిస్థితి ఉంది. ఆలస్యమైనా సాగు చేద్దామనే ఆలోచనలో ఉన్నారు. నారుకు ఎకరానికి రూ.1000 నుంచి రూ. 1500లు వరకు ధర చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎరువుల ధరలతో రైతుల బాధ చెప్పనలవి కాకుండా ఉంటోంది. గతేడాదితో పోలిస్తే పెట్టుబడుల ఖర్చు పెరిగింది. సంప్రదాయ పద్ధతిలో సాగు చేసే విధానం కొన్నేళ్లుగా మరుగునపడిపోవటంతో రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఇక కూలీల విషయానికొస్తే రూ.1200 చెల్లించి నాట్లు వేయిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.400 అదనపు భారం పడింది. నీటీ కొరత మరింత భారంగా మారేల చేస్తోంది. ఆయిల్ ఇంజన్లు పెట్టడంతో ఎకరానికి రూ.500 నుంచి రూ.750 ఖర్చు అవుతోందని చిన్నకారు రైతులు చెబుతున్నారు. అదనంగా భారాలు పడినా తప్పక సాగు చేపట్టారు. ఇప్పటికే దుక్కి చేసిన పొలాల్లో కూలీలు కలుపు తీస్తున్నారు. కలుపు మందులు సబ్సిడీపై సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



వృద్ధులకు ఆప్యాయత, ప్రేమానురాగాలను పంచుదాం

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వృద్ధులకు ఆప్యాయత, ప్రేమానురాగాలను పంచుదామని.. వారి శ్రేయస్సుతోనే సమాజానికి ఉషస్సు అని కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రపంచ వద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడ, గాంధీనగర్, హెూటల్ ఐలాపురంలో ఎన్‌టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. తొలుత ఐలాపురం హెూటల్ వద్ద కలెక్టర్ ఎస్.డిల్లీరావును మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య సత్కరించారు. అదే విధంగా కలెక్టర్ డిల్లీరావు.. ఐలాపురం వెంకయ్యను సత్కరించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ నెట్వర్క్ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ ఎల్డర్ అబ్యూస్ (ఐఎన్‌పీఈఏ) స్వచ్ఛంద సంస్థ తొలిసారిగా 2006, జూన్ 15న ప్రపంచ వద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యానికి, ఆర్థిక భద్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాల్సిన అవసరముందని.. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వద్ధులు గౌరవప్రద జీవితానికి భరోసా కల్పిద్దామని పిలుపునిచ్చారు. వయోవద్ధుల సంక్షేమ చట్టం-2007, వయోవద్ధుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించి.. వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వేధింపులకు సంబంధించి వద్ధుల ఫిర్యాదులపై డివిజన్ స్థాయిలో సత్వర పరిష్కారానికి కషిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై నాణ్యమైన చర్చలతో మంచి ఫలితాలు వచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గొప్ప కుటుంబ వ్యవస్థకు నిలయమైన మన దేశంలో వద్ధులపై వేధింపుల ఘటనలు చోటుచేసుకుంటుండటం దురదష్టకరమని.. వీటికి కారణాలను గుర్తించి, సరైన కార్యాచరణ ద్వారా వేధింపులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మెరుగైన సమాజం నిర్మితమవుతుందని.. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా దేశ సామాజిక ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన, అన్ని విధాలా అభివద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబూరావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి లంకపల్లి మణాల్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చంద్రమౌళి, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి, డాక్టర్ సీఎల్ వెంకటరావు, సీవీ బాబు, ప్రజా కళాకారులు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

వ్యవసాయ మంత్రిని కలిసిన కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కలిశారు. విజయవాడ కరెన్సీ నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

నగరంలో డ్రైన్ల పనులు

పరిశీలించిన విఎంసి కమిషనర్ దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజలు కానీ, వాహనదారులు కానీ వర్షం వల్ల రోడ్లమీద నిండి ఉన్న నీళ్లతో ఇబ్బంది పడకుండా, వర్షపు నీటి వల్ల పెరుగుతున్న ట్రాఫిక్ ఇక్కట్లు తప్పించడానికి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 'ఆపరేషన్ డీ సిల్టింగ్' నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నగరంలో జరుగుతున్న డీ సిల్టింగ్ పనులను శనివారం ఉదయం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అజితసింగ్ నగర్-కండ్రిక నుంచి ఐఆర్‌ఆర్, డిస్నీల్యాండ్ మీదుగా రైల్వే ట్రాక్ దగ్గర గల సుమారు 10 కిలోమీటర్ల దూరం ఉన్న మేజర్ అవుట్‌ఫాల్ డ్రయిన్లలో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. ముస్తాబాద్ 33 తూములు ద్వారా అవుటఫాల్ డ్రైన్‌లో నీటి ప్రవాహం రైల్వే వారి మూడో లైను నిర్మాణ పనుల వల్ల భంగం కలగడంతో రైల్వే వారితో సంప్రదింపులు జరిపి, నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈపర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైన్ల పనులను పరిశీలిస్తున్న విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వసతి గృహాల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గహాలకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేకంగా దష్టిసారించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జిల్లాలోని 19 వసతి గహాలకు ఒక్కొక్కటి రూ.3,700 విలువైన 19 బయోమెట్రిక్ డివైజ్లను కలెక్టర్ డిల్లీరావు శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయా సహాయ సాంఘిక సంక్షేమ అధికారుల (ఏఎస్‌డబ్ల్యూవో)కు అందజేశారు. అలాగే జగ్గయ్యపేట ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గహ కాంపౌండ్ వాల్‌కు అవసరమైన ఐరన్ మెస్‌ను కూడా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ వసతి గహాల్లో ఉండి విద్యార్థులు బాగా చదువుకునేందుకు వీలుగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు నమోదుకు అవసరమైన బయోమెట్రిక్ డివైజ్లను అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీనివాసరావు, ఏఎస్‌డబ్ల్యూ, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.



బయోమెట్రిక్ డివైజ్లను అందిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

మొదటిపేజీ తరువాయి



అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు : ఎంపి బాలశౌరి

కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో గన్నవరం నుంచి ముంబై నగరానికి విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విజయవాడ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరానికి ఎయిర్ ఇండియా విమాన సేవలను ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర పెద్దలతో చర్చించి విమాన సర్వీసు ఏర్పాటు చేయించినట్లు వివరించారు. అంతేకాకుండా ఢిల్లీలోని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, అధికారులతో గతంలో ఇదే విషయంపై పలుమార్లు సమావేశం నిర్వహించామని, సదరు చర్చల ఫలితంగా గన్నవరం నుంచి ముంబయి నగరానికి నూతన విమాన సర్వీసు వచ్చిందని అన్నారు. ఎయిర్పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం 5.45 గంటలకు ముంబయి నుంచి విజయవాడకు విమానం వస్తుందని, తిరిగి 7.10 గంటలకు విజయవాడ నుంచి ముంబాయికు వెళ్తుందని అన్నారు. ఎయిర్ ఇండియా ఫ్లయిట్ ఎ1- 599 నంబరుపై సర్వీసు ప్రతి రోజు అందుబాటులో ఉంటుందన్నారు. గన్నవరం (విజయవాడ) ఎయిర్పోర్టు నుంచి ముంబయికి ఎయిర్ ఇండియా సర్వీసు అందుబాటులోకి వస్తే.. విదేశాలకు వెళ్లాలనుకునే ప్రయాణీకులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముంబయి నుంచి అనేక దేశాలకు విమాన సర్వీసులు ఉన్నాయన్నారు. దీంతో విమాన సర్వీసు ఆయా దేశాలకు వెళ్లే కనెక్టింగ్ ఫ్లైట్గా సేవలు అందించనుందన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ విమానాశ్రయ అభివద్ధికి తన వంతు కషి చేస్తానన్నారు. విమానయాన శాఖ మంత్రిగా రామానాయుడు నియమితులైనందున ఆయనతో చర్చించి మరిన్ని కొత్త విమాన సర్విస్తులు రావడానికి ప్రయత్నిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయంగా ఇది అభివద్ధి చెందుతున్న తరుణంలో రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, ఎయిర్పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయం అభివృద్ధిపై ఆశలు

సర్వీసులు నిర్వహిస్తే ఈ ప్రాంతం అభివద్ధి చెందుతుంది.

గన్నవరం విమానాశ్రయానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన కార్గో సర్వీసులు ముందుకు సాగలేదు. పాత విమానాశ్రయం భవనాన్ని రూ.50 లక్షలతో కార్గో టెర్మినల్‌గా మార్పు చేశారు. ప్రస్తుతం ప్రయాణీకులు ఉండే విమాన సర్వీసుల్లోనే చిన్నచిన్న సామగ్రి రవాణా అవుతోంది. సరకు రవాణాకు సంబంధించి అన్ని సదుపాయాలు ఉన్నా కార్గో సేవలు రాలేదు. ఇవి వస్తే పంటలు, నర్సరీ, కొబ్బరి, ఆక్వా, మామిడి ఉత్పత్తులు, కూరగాయల ఎగుమతికి అవకాశమేర్పడుతుంది. ఎంపి రామ్మోహన్ నాయుడు విమానయన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినందున గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు. ఇప్పటికే టెర్మినల్ పనులు 50 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పూర్తి చేయడానికి పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పెట్టుబడి సాయం అందేనా?

వైఎస్ఆర్ రైతు భరోసా పేరుతో పిఎం కిసాన్‌తో కలిపి రూ.13 వేలు రైతులకు అందించారు. ఎక్కువ విస్తీర్ణంలో భూములున్న రైతులకు, కౌలు రైతులకు పిఎం కిసాన్‌ను కేంద్రం అందించడం లేదు. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అందించింది. ప్రతి ఏడాది మొదటి విడతగా మే, జూన్ నెలల్లో రూ.5,500 రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. జనవరిలోపు మరో రెండు దఫాలుగా మిగిలిన నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2023-24 సీజన్లో జిల్లాలోని 1,58,302 మంది రైతులకు రూ.124.78 కోట్లు విడుదల చేసింది. 2024-25 సీజన్లో ఇప్పటి వరకు విడుదల కాలేదు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలకు పెంచుతామని ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో కలిపి పెట్టుబడి సాయాన్ని అందించినా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.14 వేలు విడుదల చేయాలి. ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో పెటుబడిసాయం పెంచి త్వరగా తమ ఖాతాల్లో నగదు జమ చేయాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

అంగన్వాడీల్లో పిల్లలను చేర్పించండి



ఉయ్యూరులో...


చల్లపల్లి మండలంలో...


తోట్లవల్లూరు మండలం చాగంటిపాడులో...


కంకిపాడు మండలంలో ఈడుపుగల్లులో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ సుకన్య అన్నారు. సుందరమ్మపేట 2వ అంగన్వాడీ కేంద్రంలో పీపీ1, పీపీ2 కోర్సులు పూర్తిచేసుకున్న అంగన్వాడీ విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్య పిల్లల భవిష్యత్తుకు పునాదివంటి దాని పిల్లలను అన్ని హంగులు ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని 12వ వార్డు కౌన్సిలర్ బూరెల రమణ అన్నారు. సూపర్వైజర్ కళ్యాణివర్మ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : మండల పరిధిలోని వెలుగోలు గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మన అంగ న్వాడిలో గ్రాడ్యుయేషన్ అంటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లా డుతూ చిన్నపిల్లల అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు పౌష్టికాహారంతో పాటు క్రమశిక్షణ అలవాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్ విజయ్ కుమారి, కే విజయ్ కుమారి, జి.వాణి, కె.జయలక్ష్మి సిహెచ్ నాగలక్ష్మి, కార్యకర్త దీప్తి, తల్లిదండ్రులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ విశ్రాంతమ్మ కోరారు. శనివారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరం, వక్కలగడ్డ అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీల్లో అక్షరాలు, పాటలు నేర్చుకుని ఎంపీపీ స్కూళ్లలో చేరేందుకు సిద్ధమైన చిన్నారులకు నూతన దుస్తులు, సర్టిఫికెట్లను అందచేశారు. సర్పంచ్ వల్లూరు ఉమా, ప్రముఖ న్యాయవాది పరిశ సరస్వతి, హెచ్ఎం దుర్గారాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : మండలంలోని చాగంటిపాడు గ్రామంలో శనివారం మన అంగన్వాడీ పిలుస్తోంది.. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పిల్లలందరూ అంగన్వాడీలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహించి, ఎదుగుదలకు అవసరమైన పౌష్టిక ఆహారాన్ని అందించే అంగనవాడి పట్ల ఆకర్షితుల అవ్వాలని తమ పిల్లలను అంగన్వాడీల్లో చేర్పించాలని, అంగన్వాడి సూపర్వైజర్ సుజాత వివరించారు. అంగన్వాడి కార్యకర్తలు సుగుణ కుమారి, అనిత,జ్యోతి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : కంకిపాడు మండలం ఈడుపుగల్లులోని స్థానిక ఎంపీపీ మోడల్ హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ కిట్స్‌ను సర్పంచ్ పందిపాటి ఇందిర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పంచాయితీ వార్డు సభ్యులు షేక్ షకార్, సుంకర శ్రీహరి, అనుమోలు రామకష్ణ, మైనేని భవాని లతో పాటు, టీడీపీ సీనియర్ నేత పందిపాటి సుధాకర్, ఉపాధ్యాయులు మండవ శ్రీనివాసు, రూపవాణి, మీనా కుమారి లు పాల్గొన్నారు.

నాగేశ్వరమ్మ మృతికి సంతాపం



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం పల్లెపాలెం గ్రామం అంగనవాడి ఆయాగా పనిచేస్తున్న కొప్పనాతి నాగేశ్వరమ్మ (58) శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. ఆమె మృతికి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, ప్రాజెక్ట్ లీడర్స్ పి రెజీనారాణి సిహెచ్ నాంచారమ్మ మరియు అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ సంతాపం తెలియజేశారు.

పృథ్వీశ్వరస్వామి వార్షికోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-చల్లపల్లి : నడకుదురు పథ్వీశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని నవవిధ అభిషేకాలు జరిపించారు. దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద పండితులు కంఠంరాజు సాయి గణపతి దీక్షితులు నేతత్వంలో అనువంశిక అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేసి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, మండలి వెంకట్రామ్-సాయి సుప్రియ దంపతులను వేద ఆశీర్వచనంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విశిష్టతమైన, ప్రాచీనమైన, మహిమాన్వితమైన ఈ ప్రాచీన పుణ్యక్షేత్రాన్ని పునరుద్ధరించి పూర్తి స్థాయిలో అభివద్ధి చేసిన మండవ రవీంద్ర - రమణ కుమారి దంపతులను హదయ పూర్వకంగా అభినందించారు. ఇంతటి మహోన్నత పుణ్యక్షేత్రానికి రెండు సంవత్సరాల క్రితం ఏడు అంతస్తుల గాలిగోపురం, ప్రాకారం, ఆలయం చుట్టూ ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల ప్రతిరూపాల విగ్రహాలు, పరివార దేవతల విగ్రహాలు ఏర్పాటు చేసి ఆలయ వైభవాన్ని మండవ రవీంద్ర దంపతులు ఇనుమడింప చేశారన్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు సాయి గణపతి దీక్షితులు, వేద పండితులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సమగ్ర అభివద్ధి ప్రదాత మండవ రవీంద్ర - రమణకుమారి, నాదెళ్ల ప్రభాకరరావు - సుభాషిణి దంపతులు, నాదెళ్ళ నరసయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, గుత్తికొండ వంశీ, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న నాయకులు

ప్రజాశక్తి-మోపిదేవి : బాపట్ల ఎంఎల్ఏ నరేంద్రవర్మ విజయం సాధించడంతో సుమారు మంది మందికి పైగా మహిళలు, పురుషులు పెద్దపులుగు వారిపాలెం నుండి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి క్షేత్రం వరకు పాదయాత్రగా వచ్చి వారి మొక్కులు చెల్లించు కున్నారు. వారికి మోపిదేవి తెలుగుదేశం పార్టీ నాయకులు రావి రత్నగిరి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పెద్దప్రోలు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు డోగిపర్తి బాల కోటేశ్వరరావు సహకారంతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నందు సాంబశివరెడ్డి, సముద్రారెడ్డి, అక్కల రాజశేఖర్ రెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, నందు శివకష్ణారెడ్డి, హరికష్ణ రెడ్డి, మోపిదేవి తెలుగుదేశం పార్టీ నాయకులు, బల్లా ప్రసాద్, సిరివెళ్ల పుల్లారావు, ఉప్పాల ఏసు, జనసేన నాయకులు భోగిరెడ్డి సాంబయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

పిఎంశ్రీ పాఠశాలకు ఎంపిక

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటిమిల్లి మండలంలో శివాలయం పక్కన గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైంది. దీనిలో భాగంగా ఈ పాఠశాలలో కంప్యూటర్ విద్య బోధన కొరకు ఒక ఉపాధ్యాయుడు, కంప్యూటర్లు ఎలక్ట్రానిక్స్ విద్యా బోధన కొరకు మరొక ఉపాధ్యాయుడు నియమితుల య్యారు. ఈ విద్యా సంవత్సరం 2024 -25 నుండి ఈ పాఠశాల కంప్యూటర్ విద్య ఎలక్ట్రానిక్ విద్య, 8,9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సిసిలో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు, దీనిని బంటుమిల్లి గ్రామ పరిసర ప్రాంత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివి వెంకటరావు తెలిపారు.

బస్టాండ్లలో లీజుకు ఖాళీ స్థలాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను వ్యాపారస్తులకు లీజుకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపో పరిధిలోని మోపిదేవి, అవనిగడ్డ, చల్లపల్లి, కూచిపూడి, నాగాయలంక ,మొవ్వ బస్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న షాపులు, ఖాళీ స్థలాలు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. డిపో పరిధిలోని ఈ షాపులు కావలసినవారు టెండర్స్‌లో పాల్గొనాలని కోరారు. అవనిగడ్డ బస్ స్టేషన్ నందు వివిధ వ్యాపారాల కొరకు ఖాళీ స్థలాలు ఫ్రూట్స్ అండ్ ఫ్రూట్ జ్యూస్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, అదే విధంగా ఖాళీ స్థలం నందు ఏదైనా అనుమతించబడిన వ్యాపారం కొరకు, అలాగే చల్లపల్లి బస్ స్టేషన్ నందు టి అండ్ సమోసా, గోడౌన్లు, రెండు ఖాళీ స్థలాలు, రెండు ఎలక్ట్రికల్ పెయింట్స్ అండ్ హార్డ్వేర్ షాపులు, అలాగే నాగాయలంక బస్ స్టేషన్ లో ఒక షాపు, బస్ స్టేషన్ నందు సైకిల్ ల్యాండ్ స్కూటర్ స్టాండ్, బస్టాండ్‌లో వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు నాలుగు ఖాళీ స్థలాలు,అలాగే కూచిపూడి బస్ స్టేషన్ నందు వివిధ వ్యాపారాల కొరకు నాలుగు ఖాళీ స్థలాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అలాగే మోపిదేవి బస్ స్టేషన్‌లో రెండు ఖాళీ స్థలాలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు 73828 96721 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. శనివారం నుండి ఈనెల 27వ తేదీ వరకు సాయంత్రం ఐదు గంటల వరకు టెండర్ ఫారాలు అమ్మనున్నట్లు చెప్పారు. ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు మచిలీపట్నం డిపో కార్యాలయంలో టెండర్లు తెరవనున్నట్లు డిఎం కె. హనుమంతరావు చెప్పారు.

ఈద్గాల వద్ద తాగునీటి సౌకర్యాలు కల్పించాలి : జెసి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ఈద్గాల వద్ద శానిటేషన్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శనివారం అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి, బక్రీద్ సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఈద్గాల వద్ద తాగునీరు, తదితర వసతులు కల్పించాలని, కబేళాలవద్ద పరిశుభ్రత పాటించేలా శానిటేషన్ చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు సూచించారు. ముస్లిం సోదరులు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించుకునే సందర్భంగా ఎక్కువ సంఖ్యలో గుమికూడే ప్రాంతాల్లో క్రౌడ్ మేనేజ్మెంట్, ట్రాఫిక్ నియంత్రణలతోపాటు ఎక్కడా శాంతిభద్రతల సమస్య ఏర్పడకుండా మతసామరస్యంతో ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినం సంతోషంగా జరుపుకునేందుకు అన్ని ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ బోర్డు అధికారులు సమన్వయంతో కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ జి వెంకటేశ్వరరావు, డి ఆర్ ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవోలు, డిపిఓ నాగేశ్వర నాయక్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షంసున్నీసా బేగం, మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు

ఎస్‌పిని కలిసిన ఎంఎల్ఎ వర్ల

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం పోలీస్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు జిల్లాలో శాంతిభద్రతల ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించుకున్నారు.





కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్ఎ శ్రీరాం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : తెలంగాణ రాష్ట్రం, మధిర నియోజకవర్గం, ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామం వద్ద మునేరు గండిని పూడ్చి జగ్గయ్యపేట నియోజకవర్గంలో వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలో మునేరు డ్యాం కిందనున్న 20 వేల ఎకరాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి విషయం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అన్న క్యాంటీన్ పున:ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం మొదటి 5 హామీల్లో ఒకటైన అన్న క్యాంటీన్ పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయగా శనివారం పట్టణంలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి కమలా థియేటర్ సెంటర్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అధికారులను ఆదేశించి, అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ పునఃప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై స్థానిక అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అన్నా క్యాంటీన్ పూర్తిస్థాయిలో నిర్వాహణకు అవసరమైన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి రాఘవ, కన్నెబోయిన రామలక్ష్మి, సూర్యదేవర రాంప్రసాద్, వెదులాపూరి సైదా నాయుడు, కటికల అనిల్, మున్సిపల్ డిఇ కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపల్ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్ పరిసరాలను శనివారం నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమ మాలిని పరిశీలించారు. అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాదం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

'ముస్లింలకు అన్యాయం'

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఉప ముఖ్యమంత్రి పదవుల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ ముస్లింలకు చంద్రబాబు అన్యాయం చేశారని వైసీపీ నాయకులు పోతిన వెంకట మహేష్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు మొదటి సంతకం సామాజిక మోసంపై చేశారని, ఉప ముఖ్యమంత్రి పదవుల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ ముస్లింలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. జగన్ ఐదేళ్ల పాలనలో బీసీ ఎస్టీ మైనార్టీ కాపు సామాజిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చి ఆ సామాజిక వర్గాల ఆత్మగౌరాన్ని పెంచారని, సామాజిక న్యాయం చేశారని అన్నారు. 2024లో జగన్మోహన్ రెడ్డికి మించి మీరు సామాజిక న్యాయం చేయాలి కదా? కానీ బీసీ ఎస్సీ ఎస్టీ ముస్లిం వర్గానికి ఉపముఖ్యమంత్రి పదవులు ఇవ్వకుండా కేవలం పవన్ కళ్యాణ్‌కి మాత్రమే ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి మీరు బీసీలను ఎస్సీలను ఎస్టీలను ముస్లింలను అవమానించారని విమర్శించారు.



మాట్లాడుతున్న పోతిన మహేష్

రైతులకు అందుబాటులో పచ్చిమేత విత్తనం

ప్రజాశక్తి - తిరువూరు : పశువుల పోషణకు కావలసిన వాటిలో ముఖ్యమైన పచ్చి మేతను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు సూపర్ నేపియర్ గడ్డి కణుపులను (విత్తనాన్ని) ఉచితంగా కృష్ణ మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రైతులకు అందజేస్తున్నట్లు యూనియన్ జిల్లా డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. తిరువూరు మండలం, లక్ష్మీపురం పాలసీతల కేంద్రం క్లస్టర్ పరిధిలోని కోకిలంపాడు, అక్కపాలెం, గొల్లమందల, చౌడవరం, ముష్టికుంట్ల తదితర గ్రామాల పాడ్ రైతులకు గడ్డి కణుపులను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణతో పాటు మేనేజర్ సాంబమూర్తి మాట్లాడుతూ ఈగడ్డి కణుపులను భూమిలో నాటిన 45-60 రోజుల్లో కోతకు సిద్ధంగా ఉంటుందన్నారు. ఆకులు నునుపుగానూ, వెంట్రుకలు లేనివిగా గడ్డి ఉంటుందన్నారు. దాని రసం తియ్యగా ఉన్నందున జంతువులు వాటిని తినడానికి ఇష్టపడతాయని చెప్పారు. మృదువైన, సౌకర్యవంతమైన కాండం, ఆకు కూర్పు, అధిక రుచిని కలిగి ఉండటం వల్ల ఇతర మేత గడ్డితో పోలిస్తే సూపర్ నేపియర్ గడ్డి కడుపు ఉబ్బరం ప్రమాదాన్ని తక్కువగా కలిగి ఉంటుందని రైతులకు వివరించారు. ఇది తెగుళ్లను వ్యాధులను నిరోధిస్తుందన్నారు. ఏడాదిలో ఎకరానికి 180 నుంచి 200 టన్నుల దిగుబడి వస్తుందని (రైతులకు తక్కువ కాలంలో అధిక దిగుబడి) వెల్లడించారు. నీటి పారుదల సమస్యలు ఉన్న ప్రాంతాల్లో కూడా పెంచుకోవడానికి అనువైవుగా ఉంటుందని చెప్పారు. సూపర్ నేపియర్ గడ్డి పెరుగుతుందంటే, మట్టికి పోషకాలు అందుతాయని, మట్టి దృఢంగా ఉంటుందని ఈ గడ్డి పెరుగుదల క్షీణించిన భూములను పునరుద్ధరించడంలో సహాయపడుతుందన్నారు.



పచ్చి మేత విత్తనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మెగా డిఎస్‌సిపై హర్షం

ప్రజాశక్తి - నందిగామ : ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయ నియామకాల కోసం మెగా డీఎస్సీ పై తొలి సంతకం పెట్టడం హర్షనీయమని పిఆర్‌టియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, కోసూరి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా నున్న 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ విడుదల చేసే దస్త్రంపై నిరుద్యోగుల సమక్షంలో మొదటి సంతకం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష మేరకు పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తున్న జీవో 117 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల విద్యార్థుల నిష్పత్తిని శాస్త్రీయంగా సరి చూసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని ఉపాధ్యాయ పోస్టులు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం, విద్యార్థులకు సరైన విద్యా బోధనకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని నవాబ్ జానీ, రాజశేఖర్ ఒక ప్రకటనలు తెలిపారు.

మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - నందిగామ : నారాయణ ఈ - టెక్నో స్కూల్‌లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎజి.ఎం. హరీష్ కేక్ కట్ చేశారు. మంత్రి నారాయణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎ.జి.యం.హరీష్ మాట్లాడుతూ నూతన మంత్రి వర్గంలో నారాయణ కు మంత్రి పదవి దక్కటం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.జి.ఎం.హరీష్, ఆర్.ఐ. పవన్ కుమార్, ప్రిన్సిపాల్ కుమార్ స్వామి,శివ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావు వర్ధంతి

ప్రజాశక్తి - కంచికచర్ల : నందిగామ మాజీ ఎంఎల్ఎ, టిడిపి నేత తంగిరాల ప్రభాకరరావు 10 వ వర్ధంతి శనివారం కంచికచర్లలో నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో తంగిరాల ప్రభాకరరావు చిత్ర పటానికి ఆయన కుమార్తె ప్రస్తుత ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పూలమాల వేసి నివాళు లర్పించారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి కృషి ఎనలేనిదన్నారు. ఆయన ఆశయాలకనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండల టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, ఎఎంసి మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక, నాయకులు వేమా వెంకట్రావు, గుత్తా రత్నం, అన్నదాత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న సౌమ్య

నందిగామ : నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల ప్రభాకర్ రావు 10వ వర్ధంతి వేడుకలు నందిగామలో శనివారం నిర్వహించారు. మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు,నెట్టెం రఘురాం, వసంత నాగేశ్వరరావు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, తంగిరాల ప్రభాకరరావు ఘాట్ వద్ద నివాళులర్పించారు. కాకాని నగర్, గాంధీ సెంటర్లో తంగిరాల ప్రభాకర్ రావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీ సెంటర్లో అన్నదాన కార్యక్రమాన్ని దేవినేని ఉమా, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఈవో కెఎస్. రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - మైలవరం : ఇంటికి వెళ్లే సమయంలో బైక్ అదుపుతప్పి రహదారిపై పడటంతో బైక్ నడుపుతున్న వ్యక్తి తలపై నుండి కారువెళ్లడంతో సంఘటన స్థలంలోనే ఒకరు దుర్మరణం చెందిన సంఘటన శనివారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు ప్రకారం జి.కొండూరు మండలం చిన్న నందిగామకు చెందిన బలుసు మురళి (38) సెంట్రింగ్ పనులు చేస్తూ ఉంటాడు. ఎరుపాలెం మండలం జమలాపురంలో పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా లక్కిరెడ్డి అనిమిరెడ్డి హైస్కూల్ వెనుక తిరువూరు బైపాస్ రోడ్ రింగ్ దాటిన అనంతరం జాతీయరహదారిపై పడ్డాడు. విజయవాడ నుండి తిరువూరు వైపు వెళ్తున్న కారు తలపైకి ఎక్కటంతో మురళి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లందరికీ ఈ రోజు మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మీ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సాగు మొదలవుతున్న తరుణంలో డీలర్ల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఇన్వాయిస్‌లు లేకుండా స్టాక్స్ తేకూడదని, ఎప్పటికప్పుడు రైతులకు బిల్లు ఇవ్వాలని, ఎంఆర్‌పి ధరలకు మించకుండా విక్రయించాలని డీలర్లకు సూచించారు. కొత్త గోడౌన్లు, కొనుగోలు చేసే అధికార పత్రాలను లైసెన్సులో ఎంటర్ చేయించుకొని విక్రయించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అనుమతి లేని కంపెనీల వద్ద కొనుగోలు చేయకూడదని, అటువంటి నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించే డీలర్లపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ డీలర్ల మీటింగులో మండలంలోని విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ శ్రీరామ్, రఘురామ్‌ను కలిసిన నాయి బ్రాహ్మణులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాంను శనివారం నాయి బ్రాహ్మణలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణల సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ సానుకూలంగా స్పందించారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : యాప్స్ ద్వారా అంగన్వాడీలు పనితనాన్ని ప్రాజెక్టు పరిధిలో మెరుగు పరుచుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి సూచించారు. మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి, అంగన్వాడీ పిల్లలకు పిపి2 సర్టిఫికెట్స్‌ను ఉమాదేవి అందజేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ పరిధిలో బాల్య వివాహాలను నిరోధించి, వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాల జరగ బోయే అనార్థాలపైన అవగాహన కల్పించాలని కోరారు. బాలికల అక్రమ రవాణా మొదలైన విషయాలలో అంగన్వాడీ కార్యకర్తలు పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోషణ ట్రాకర్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సిడిపిఒ జె.లక్ష్మి భార్గవి, ప్రాజెక్టు సూపర్ వైజర్స్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలోని కనుమూరు గ్రామానికి చెందిన దొంతి బోయిన నాగేంద్రబాబు కట్టలేరు నుండి ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. అటుగా వస్తున్న తమ సిబ్బంది కంటపడగా ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరిస్తూ, ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ వివరించారు.

ఇంటి అద్దెల మోత..



ప్రజాశక్తి- గన్నవరం : గన్నవరంలో భవనాల అద్దెలు మోత మోగుతున్నాయి. రాజధాని నేపథ్యంలో ఇంటి అద్దెలు మరింత పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి వారు హడలిపోతున్నారు. గత మూడు నెలల క్రితం రేకుల షెడ్డు ఇంట్లో రెండు గదులకు అద్దె వెయ్యి నుంచి 1200 రూపాయలు తీసుకునే వారు. భవనాల్లో అద్దె రూ.2,500నుంచి రూ.3 వేలు వరకు ఉండేది. పూరిళ్లలో అద్దె రూ.300 నుంచి రూ.500 ఉండేది. దీంతో సామాన్య, మధ్యతరగతి వారు అద్దెకు ఉండటానికి ఇబ్బందిపడే వారు కాదు. సంపాదించిన దాంట్లో అద్దెలు కట్టుకుని ఇబ్బందులు లేకుండా ఉండేవారు. రాజధానితో పాటు విమానాశ్రయానికి జాతీయ హెూదా ప్రకటించడంతో అపార్టుమెంట్లు అధికం గా కడుతున్నారు. ఇళ్ల అద్దెలు ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లాయి. ఇళ్లను అద్దెకు తీసుకునేందుకు ఉద్యోగులు ఎగబడటంతో యజమానులు అద్దెలు పెంచేస్తున్నారు. నూతనంగా కట్టిన అపార్టుమె ట్లు, భవనాల్లో ఆధునిక వసతులు కల్పించి మరీ అద్దెలు పెంచి వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం అద్దెలు రేకుల షెడ్లులో రెండు గదలుకు రూ.3 వేలు, భవనాల్లో ఒక పార్షన్కి రూ.4 వేల నుం చి 5 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. అపార్టుమెంట్లలో రూ.6 వేల నుంచి రూ.8 వేలు తీసుకుంటున్నారు. మూడు బెడ్రూమ్స్ ఇలైతే రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఈవిధంగా అద్దెలు తారా స్థాయికి వెళ్తుండటంతో సామాన్యులు, కార్మికులు పట్టణంలో ఉండటానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో గన్నవరానికి కొంత దూరంలో ఉన్న వెంకట నరసింహాపురానికి వెళ్తున్నారు. నూతన భవనాల యజమానులు అద్దెలు గట్టిగా వసూలు చేసుకుని జేబు లు నింపుకుంటున్నారు. గన్నవరంలో 69 వరకు అపార్టుమెంట్లు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కొత్తగా 120 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. భరించలేని విధంగా ఎరుగుతున్న అద్దెలతో జనాలు నానా అగచాట్లు పడుతున్నారు.

అద్దె నియంత్రణ చట్టం ఎక్కడా...?

రాష్ట్ర ప్రభుత్వం అద్దె నియంత్రణ చట్టాన్ని అమలు చేస్తామని ప్రకటించినా నేటికీ అమలు చేయలేదు. దీంతో భవనాల్లో అద్దెలకు రెక్కలొచ్చాయి. టూబెడ్ రూంప్లాటికి రూ.8 నుంచి రూ.10 వేలు తీసుకుంటున్నారు. తాము లక్షలు ఖర్చు పెట్టి ప్లాట్లు కట్టింది తక్కువ అద్దెకు ఇవ్వడానికి కాదని యజమానులు చెబుతున్నారు. అద్దెల విషయంలో భవిష్యత్లో గన్నవరం రాజధానితో పోటీ పడుతుందని అం టున్నారు. ఇదిలాగుంటే గతంలో ఎప్పుడో నిర్మించిన పాత భవనాల్లో కూడా అద్దెలు పెంచేశారు. రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు సాధారణ భవనంలోని ప్లాట్కి వసూ లు చేస్తున్నారు. రోడ్డుకు అనుకుంటే ఉంటే రూ.పది వేలు కట్టాల్సిందే. సామాన్యులు ఇల్లు అద్దె కు తీసుకోలేని దుస్తితి వచ్చింది. అపార్టుమెంట్ నిబంధనలకు విరుధంగా కట్టేస్తున్నారు. కొత్త భ వనాలు కూడా అనుమతుల్లేకుండా కడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది.



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ పట్టణంతో పాటు నియోజకవర్గంలో 100 రోజుల్లో అభివద్ధి చూపిస్తానని, పతి ఇంటికి మంచినీరు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం గుడ్లవల్లేరు, నందివాడ మండలాల రెవెన్యూ శాఖ అధికారులు, ఇతర శాఖల ఉద్యోగులు ఎమ్మెల్యే రాముకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కేంద్ర గ్రామీణా భివద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్తో మాట్లాడి కేంద్రం నుండి కూడా నిధులు తీసుకు వచ్చి గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి బీసీ సెల్ నాయకులు దారం నరసింహారావు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

17న మహాసభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రాణి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఈనెల17న జరిగే మండల స్థాయి మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వడ్లమన్నాడు హరిజనవాడ, కొండెపాలెం, వులలవ లపూడి గ్రామాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాణి శనివారం విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 గ్రామల నుండి 100 మంది ప్రతినిధులతో సోమవారం ఉదయం 10 గంటలకు మండల మహాసభ వడ్లమన్నాడులో ప్రారంభం అవుతుందన్నారు. ముఖ్య అతిధిగా రాష్ట ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ,జిల్లా కార్యదర్శి పవన్, రాష్ట్ర ఉపద్యక్షురాలు వంకాయల పాటి రాణి ,మండల నాయకులు బి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా ఉపాధి పనులు పెంపు కోసం గతంలో ఉన్న 66 రకాల పనులను తిరిగి ప్రవేశ పెట్టాలని తీర్మానం ఆమోదిం చబోతున్నామని, కుటుంబానికి 100 రోజులు కాకుండా మనిషికి 100 రోజుకు చూపించాలనేది ప్రధాన డిమాండ్ గా ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఉపాధి కూలీలంతా హాజరై సభను జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్లమన్నాడు గ్రామ కార్యదర్శి కటికల యాకోబు, ఉపాధ్యక్షురాలు పామర్థి రమాదేవి, రేణుకారాజు,వులవలపూడి గ్రామ కార్యదర్శి పామర్థి రాజ్యలక్ష్మి, మండల నాయకులు బి.వి.శ్రీనివాసరావు, ఎల్.ఐ. సి.విశ్రాంతి ఉద్యోగి సత్తా ప్రసాద్ పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జనసేన పార్టీ నుండి శాసనసభ్యులుగా ఎన్నికైన మండలి బుద్ధ ప్రసాద్కు అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పంచాయతీరాజ్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యాపకులు సిబ్బందితో కలిసి వచ్చి ఆయన ఇంటి వద్ద పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ డీఈ బండారు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు వర్క్ ఇన్స్పెక్టర్లు కార్యాలయం సిబ్బంది తరలివచ్చి బుద్ధ ప్రసాద్ ను పూలమాల వేసి శాలువాతో సత్కరించారు.

లైబ్రరీ సెస్ బకాయిలు చెల్లించాలి : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన లైబ్రరీ సెస్ బకాయిలను ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ సెస్ కలెక్షన్ కమిటీ చైర్ పర్సన్ జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మున్సిపాలిటీ, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టరేట్ నుంచి మచిలీపట్నం, పెడన, గుడివాడ, ఉయ్యూరు, వైయస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో వర్చువల్ సమావేశం (గూగుల్ మీట్) నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థకు 2016 నుంచి రూ.11.90 కోట్లు లైబ్రరీ సెస్ బకాయిలను జిల్లా పంచాయతీలతో పాటు వివిధ మున్సిపాలిటీలు సక్రమంగా చెల్లించడం లేదని, వాటి చెల్లింపునకు తగిన చర్య లు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీటిలో అత్యధికంగా పంచా యితీలు రూ.8 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉండగా, మచిలీపట్నం మున్సిపాలిటీ రూ.23 లక్షలు, గుడివాడ రూ.1.35 కోట్లు, పెడన రూ.3.2 లక్షలు, ఉయ్యూరు రూ.9.2 లక్షలు, వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ రూ.1.67 కోట్లు బకాయిలు పడినట్లు తెలిపారు.నూజివీడు మున్సిపాలిటీకి సంబంధించిన బకాయిలను ఉమ్మడి కష్ణాజిల్లా పరిధికి లేదా కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాకు చెల్లింపు



విషయంపై వారి నుండి తగిన వివరణ తీసుకోవాలని గ్రంథాలయ సంస్థ అధికారులకు సూచించారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని మున్సిపాలిటీలు 15 శాతం సర్వీస్ చార్జీలను మినహాయిం చుకుని మిగిలిన మొత్తాలను సంస్థకు చెల్లించాలన్నారు. ఇక నుండి సంవత్సరానికి కాకుండా నెల లేదా త్రైమాసికానికి ఒకసారి క్రమం తప్పకుండా లైబ్రరీ సెస్సులను చెల్లించాలన్నారు. ఈ వర్చువల్ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



శుభకాంక్షలు తెలుపుతున్న ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు తదితరులు

మంత్రి పార్థసారధికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా పదవిబాధ్యతలు చేపట్టిన నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ముదునూరు పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్, టీడీపీ నా యకుడు పాలడుగు సత్యనారాయణ, ముదు నూరు మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాస రావు, జనసేన నాయకుడు దాకారపు అజయ్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం విజయవాడలో పార్థసారథిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గహనిర్మాణ శాఖ మంత్రిగా పేదలకు ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్ల నిర్మాణానికి కషి చేసి వారికి గూడు కల్పించి భవిష్యత్తులో మరిన్ని పేరు ప్రఖ్యాతులు గడించాలని ఆకా క్షించారు. **ప్రజాశక్తి.. గన్నవరం :** రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, కష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకష్ణ, కష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకష్ణ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి తదితరులు ఆయనను కలిసి ఘనంగా దశ్యాలువాతో సత్కరించి పూల బొకే అందజేశారు.



కీలక హామీల అమలు హర్షణీయం : కొనకళ్ల

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఐదు కీలక హామీల అమలపై నిర్ణయం తీసుకోవడం హర్షణీయమనిటిడిపి కష్ణా జిల్లా అద్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. శనివారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే మెగా డిఎస్సీపై మొదటి సంతకం చేశారని, అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై సంతకం చేశారన్నారు. ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టడానికి అన్న క్యాంటీన్లో పునఃప్రారం భిస్తామన్నారు. జగన్ మోహన రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒక్క రంగం నిర్వీర్యం అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య), మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాదు, జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబురావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు,గరిమెళ్ళ నరేంద్ర చౌదరి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మాదివాడ నరసింహారావు, బత్తిన దాస్ పాల్గొన్నారు.

జూన్‌లో విరిసిన 'మే' పుష్పం



ప్రజాశక్తి మోపిదేవి : వేసవిలో వికసించే మే పుష్పం జూన్లో పుష్పించి చూపర్లను ఆకట్టుకుంది. మోపిదేవి మండల తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది సంరక్షణలో ఉన్న మే మొక్క నుంచి చిగురించిన పుష్పాన్ని ప్రతి ఒక్కరు ఆసక్తిగా తిలకిస్తున్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక (జెవివి) మండల ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా తిరువూరు మండలంలోని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పొగాకు ఉత్పత్తుల వినియోగం - నష్టాలు అనే అంశంపై రూపొందించిన కరపత్రాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. చిన్న వయసులోనే కొందరు సిగరెట్, బీడీ వంటి పొగాకు ఉత్పత్తులని వినియోగిస్తున్నారని, మద్యానికి బానిసలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు వి.సాయిరాం, జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, రాము తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - మైలవరం : న్యాయవాదులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సిఎం చంద్రబాబు నాయుడు సంతకం చేయడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ.ఏ.ఎల్) రాష్ట్ర కార్యదర్శి బుద్ధవరపు వెంకటరావు మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీ ప్రసాద్, వీటి కిషోర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు వివిధ రకాలుగా నిరసన తెలియజేస్తూ కోర్టుకు హాజరు కాకుండా విధులు బహిష్కరించి విజయం సాధించారని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టును అమరావతిలోనే పూర్తిస్థాయిలో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాకాంక్ష మేరకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు : టిడిపి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్రంలో మళ్లీ ప్రజా పరిపాలన మొదలైందని, సుపరిపాలన దిశగా ఈ రాష్ట్రం ముందుకెళ్తుందని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘు రామ్ అన్నారు పట్టణం లోని రఘు రాం స్వగృహంలో శని వారం విలేకరుల సమా వేశం


మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

ఏర్పాటు చేశారు. చంద్ర బాబు ఎన్నికల ప్రచారంలో ఏదైతే వాగ్దానం చేశారో ఆ మేరకు మొట్టమొదటి సంతకాన్ని మెగా డీఎస్సీ మీద పెట్టారన్నారు. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు మీద చేశారన్నారు. టైట్లింగ్ డీడ్ ప్రజలందరికీ ఉపయోగకరమనే విషయాన్ని చెబుతూనే మరొక పక్క పూర్తిగా ఆస్తుల్ని కైంకర్యం చేసే విధంగా ఆ చట్టాన్ని జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని దాన్ని ఒక్క కలంపోటుతో ప్రజల ఆకాంక్షల మేరకు చంద్రబాబు రద్దుచేశారని అన్నారు. స్కిల్ సెన్సస్ మీద సంతకం చేశారన్నారు. ఉద్యోగార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరముందని గుర్తించి నైపుణ్యాభివృద్ధి సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించినందుకు నెట్టెం రఘురామ్ కేక్‌కట్ చేసి నాయకులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకుడు గింజుపల్లి రమేష్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి షేక్ అన్వర్, తెలుగు మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు రేపాల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుబ్బారెడ్డి వర్ధంతి



విజయవాడ సెంట్రల్‌లో సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన బాబూరావు, తదితరులు

విజయవాడ : ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు టి.సుబ్బారెడ్డి 5వ వర్ధంతి సభలు పలుచోట్ల నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు స్థానిక నోవాటెల్ హోటల్ పక్కన రామకృష్ణ మార్బుల్ సెంటర్లో సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రావాడలక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బారెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ముఠా రంగాన్ని అభివృద్ధి చేశారని 50 సంవత్సరాలు సిఐటియు ముఠా రంగానికి రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడ నగరానికి ఎనలేని అలుపెరగని సమరశీల పోరాటం కృషి చేశారన్నారు. ముఠారంగ, నాయకత్వం హమాలీలు, కార్మిక వర్గం ఆయన వదిలి వెళ్ళిన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపుఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయవాడ తూర్పు సిటీ నగర అధ్యక్ష కార్యదర్శులు రాజు, ఎన్.కోటబాబు, ముఠా నాయకులు సిహెచ్.ఈశ్వరరావు, మల్లేష్ తదితర ముఠా హమాలీ కార్మికులు పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింహారావు, సిహెచ్. బాబూరావు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ముఠా రిక్షా మున్సిపల్ వంటి అనేక తరగతుల కార్మికులను సమీకరించి సిఐటియును కార్మిక పోరాటాలను నిర్మించడానికి సుబ్బారెడ్డి విశేష కృషి చేశారని తెలిపారు. ఈ సభల్లో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.దుర్గారావు, ఎం.వి.సుధాకర్, ఎం.సీతారాములు, టి.ప్రవీణ్ ముఠా కార్మిక సంఘం నేతలు ఎం.బ్రహ్మయ్య నరసింహులు వెంకట్రావు శ్రీరాములు రెడ్డి, నాలి శ్రీను పాల్గొన్నారు. గవర్నర్ పేటలోని, ఎన్టీఆర్ కాంప్లెక్స్, ఆలీ బేగ్ వీధి ప్రాంతాల్లో సిఐటియు అనుబంధ సంస్థ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. సుబ్బారెడ్డి చిత్రపటానికి నేతలు, కార్మికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడారు. సుబ్బారెడ్డి నాలుగున్నర దశాబ్దాలపైగా ముఠా కార్మికులను కూడగట్టి ఉద్యమాలు నడిపారన్నారు. వామపక్షాల కార్పొరేషన్‌లో సుబ్బారెడ్డి కార్పొరేటర్‌గా పనిచేసి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఈ సభలలో ముఠా కార్మిక నేతలు బ్రహ్మయ్య, నరసింహులు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

స్థానిక రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముఠా కార్మికుడు మస్తాన్ కుటుంబానికి ముఠా కార్మికులు రూ.52,000 ఆర్థిక సాయం చేశారు. వీటిల్లో రూ. 47, 150 ముఠా కార్మికులు సాయం చేయగా, ముఠా కార్మిక సంఘం నేత సుబ్బారెడ్డి అల్లుడు, నేతాజీ పబ్లిక్‌స్కూల్ అధినేత తిరుపతిరెడ్డి మరో ఐదు వేలు ఆర్థిక సాయం చేశారు.

భవానీపురం : భవానీపురం ఐరన్ యాడ్ కాంప్లెక్స్‌లో ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన సభలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాములు, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, యుటిఎఫ్ మాజీ నాయకులు తిరుపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఠా కార్మికుల సమగ్ర సంక్షేమ చట్టం కోసం ముఠా కార్మికుల సాంప్రదాయ హక్కుల కోసం పని భద్రత కోసం నగరంలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు రోశయ్య, ఏ. వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ కె.వెంకటరమణ, రామారావు తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్ శంకర్ కేఫ్ సెంటర్‌లో సిఐటియు పశ్చిమ సిటీ అధ్యక్షులు జి.వెంకట్రావు (చౌదరి) ఆధ్వర్యంలోసభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక నాయకులు రామారావు, ఏడుకొండలు, శ్రీను, రాజు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.


రామకృష్ణ మార్బుల్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎ.వి.నాగేశ్వరరావు


మాట్లాడుతున్న నరసింహారావు



భవానీపురం ఐరన్ యార్డు మార్కెట్‌లో సుబ్బారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో బోయి సత్యబాబు, సీతారాములు

'బడికి పోతా' కార్యక్రమం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుమలగిరి జంగాల కాలనీలో బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు, తిరుమలగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సదుపాయాలు గురించి తెలియజేసి ఇంకా బడిలో చేర్చని 6సంవత్సరాల నుండి 14సంవత్సరాల వయసున్న విద్యార్థులను తప్పనిసరిగా బడిలో చేర్చాలని వారికి అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మహిళ పోలీస్ పవిత్ర, ఉపాధ్యాయులు ప్రసాద్ బాబు, రత్నం మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

తిరువూరులో పంజాబ్ విద్యార్థుల సేవలు

ప్రజాశక్తి- తిరువూరు : పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు తిరువూరులో 26 సంవత్సరాలుగా సేవలు చేస్తున్న ఐడియాస్ స్వచ్ఛంద సంస్థలో సామాజిక సేవ చేసేందుకు ముందుకొచ్చినట్లు ఐడియాస్ సంస్థ అధినేత అవ్వారు శౌరి శనివారం విలేకర్లకు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చెందిన పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థులు ఎస్‌డి.గాలిభాషా, హేమంత్ చరణ్, వివేక్, ప్రభురాజ్ కుమార్, బాలాజీ, లోహిత్ నారాయణలు ఐడియాస్ సంస్థలలో అనుభవం కోసం, సేవలు అందించనున్నట్లు శౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ విద్యాలోకా తెలంగాణ కోఆర్డినేటర్ కొంగల రవి బాబు, బుడుపుల పండు వరప్ర సాద్, ఐడియాస్ కోఆర్డినేటర్ శ్రీకాకుళం వేణు, ఈవిద్యాలోకా ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, అంతయ్య, రాణి పాల్గొన్నారు.

200 పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి - ఏ కొండూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు వంకాయల పాటి రాణి కూలీలకు పిలుపునిచ్చారు. ఏ కొండూరు మండలం రామచంద్రాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో శనివారం ఆమె మండల నాయకులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరు వారాల నుండి ఉపాధి కూలీ డబ్బులు రావట్లేదని, కార్డులో పని దినాలు ఉన్నాగాని పని చూపించలేదని, కార్డుకు 100 రోజులు పని దినాలు సరిపోవట్లేదని, 200 రోజులు పని దినాలు కావాలని, పనిచేసిన ప్రదేశంలోనే పే స్లిప్పులు ఇవ్వాలని, రోజుకు 200 రూపాయలకు మించి కూలి రావట్లేదని కూలీలు ఆమెకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిదానంగా కూలీలకు దూరం చేసేందుకు ప్రభుత్వాలు చేసిన పనికి కూలి కూడా సక్రమంగా ఇవ్వటం లేదన్నారు. ఈ పనిని తీసేస్తే వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోతారని, కాబట్టి ఈ పథకాన్ని పథకాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్లమిరెడ్డి, మేటు కొప్పెర సావిత్రి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న రాణి

వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : పాఠశాలలు పున:ప్రారంభం సందర్భంగా రెడ్డిగూడెం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో పాస్టర్ ప్రత్తిపాటి ఇస్సాకు - ఎలిజబెత్ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రత్తిపాటి పాల్ ఇమ్మానుయేలు, కోడలు సుష్మా షారోను దంపతుల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవ జి.విశ్వనాథ్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్, డైరెక్టర్ హన్న, గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్ ఇమ్మానుయేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం పవన్ కళ్యాణ్ పోరాడాలి

ప్రజాశక్తి - భవానీపురం : రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని ఒప్పించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోరాడాలని ఆయనకు గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీ నాగరాజన్ శనివారం లేఖ వ్రాశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం హోదా కావాల్సిందేనని అన్నారు. అలాగే రాష్ట్రంలో మద్య నిషేధం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం వలన మహిళలకు తగిన రక్షణ లేకుండా పోతోందని గాంధీనాగరాజన్ ఆవేదన వ్యక్తంచేసారు.

అనధికార జంతువధ నిషేధం : కమిషనర్

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ, ఈనెల 17వ తేదీన బక్రీదు పండగ సందర్భముగా పట్టణములోని ఆవులు, లేగ దూడలు, పాలిచ్చే గేదెలు మరియు ఇతర నిషిద్ధ పశువులను వధించరాదని కబేల యజమానుదారులకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల కుమార్ శనివారం తెలిపారు. అందుకు భిన్నముగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు జంతు హింస నివారణ చట్టాల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలన్నారు. దీనికి సంబంధించి హైకోర్టు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బంది ని బృందాలుగా ఏర్పాటు చేసి నిఘా పెట్టామని పేర్కొన్నారు.

ఎన్‌జి రంగా సాహిత్య పురస్కారానికి రచనలు ఆహ్వానం

ప్రజాశక్తి-గుంటూరు : ఆచార్య ఎన్‌జి రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి ఎన్‌జి రంగా సాహిత్య పురస్కారాలకు ఈ ఏడాది రచయిత్రులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు తెలిపారు. 2021-23 సంవత్సరాల్లో తెలుగు రచయిత్రులు రాసిన నవలలు మాత్రమే పరిశీలనకు పంపించాలని, ఎంపికైన నవలలో మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు నగదు పురస్కారం ఉంటుందన్నారు. పోటీకి తమ రచనలు పంపే వారు నాలుగు ప్రతుల చొప్పున డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202-శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను రామయ్య నగర్, ఒంగోలు 523002 (ఫోన్ నంబర్ 9849799711) అడ్రస్‌కు పంపించాలన్నారు. నవంబర్ 7న గుంటూరులో జరిగే ఆచార్య ఎన్‌జి రంగా జయంతి వేడుకల సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేయటం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు (98494 97739), డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు (93930 15584), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (98483 51517) నంబర్లలో సంప్రదించాలని కోరారు.

20న హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ సంస్థలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో శిక్షణతోపాటు, కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తారని, దేశంలో ఉన్న 10 హ్యాండ్‌లూమ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో వెంకటగిరి ఇనిస్టిట్యూట్ ఒకటని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన అభ్యర్థుల మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని, ఈ కోర్సు పూర్తి చేసిన వారికి పలు చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఉన్నత చదువులు చదవాలనుకున్న వారికి ఈ కోర్సు చేసిన తర్వాత నేరుగా రెండో సంవత్సరం బి.టెక్‌లో ప్రవేశించవచ్చన్నారు. ఈ కోర్సు చదివేవారందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైఫండ్ పొందటానికి అర్హులని, ఇతర వివరాలకు కాలేజి వెబ్‌సైట్ www.lihtvgr.com ను సందర్శించాలని, లేదా 9441795408, 9866169908, 9010243054 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి



ప్రజాశక్తి మంగళగిరి : మహాకవి శ్రీ శ్రీ 41 వ వర్ధంతిని శనివారం పాత మంగళగిరి పొట్లాబత్తుని వెంకటేశ్వరరావు కళా నిలయంలో మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించింది. ప్రపంచంలో తెలుగు భాష ఎంతో మాధుర్యమైనదని, జాతీయ భాషగా తెలుగును గుర్తించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని మహాకవి శ్రీశ్రీ అనేక చోట్ల తన మనసులో మాట చెప్పారని సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ప్రగతిశీల కవి గోలి మధు మాట్లాడుతూ నేటి దోపిడీ సమాజాన్ని నిలదీసే ఆయుధం అన్నారు.పుర ప్రముఖులు నన్నపనేని నాగేశ్వర రావు ప్రసంగిస్తూ శ్రీశ్రీ తో తనకు గల అనుబంధాన్ని వివరిం చారు. విశ్వశాంతి కళా పరిషత్ వ్యవస్థాపకులు పొట్లాబత్తుని లక్ష్మణ రావు గారు శ్రీశ్రీ సినిమా పాటలను ఉటంకిస్తూ ప్రసంగించారు. బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య శ్రీశ్రీ సాహిత్య అంశాలను, ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో రేఖా కృష్ణార్జునరావు, రేఖ చంద్రశేఖర్, ఎస్ భూపతి, గోలి సీతారామయ్య, ఏ తాతారావు, మంచా విజయమోహన్ రావు, చావరాల ఇందిరా, సాంబిరెడ్డి (విజయప్రెస్) కారంపూడి అంకమ్మ రావు, మహమ్మద్ యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలుపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ అధ్యక్షతన శనివారం వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం డిఇఒ కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్ష ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. జులై 12వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 6-14 ఏళ్లలోపు ఉన్న పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని, వందశాతం ప్రవేశాలు ఉండాలని సూచించారు. బడి మానేసిన పిల్లల్ని సిఆర్‌పిలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇందుకు జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. అలాగే ఈనెల 18వ తేదీ వరకూ బడి ఉత్సవం, బాలికా ఉత్సవం, విద్యా సదస్సు వంటివి నిర్వహించాల్సి ఉందన్నారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ శాఖ, ఉప విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న చంగయ్య

ప్రజాశక్తి మంగళగిరి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండిగ్ అలవెన్స్ తక్షణం చెల్లించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళగిరి పట్టణ కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచంద్రరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.పెండింగ్లో ఉన్న రెండు నెలలు హెల్త్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని, సమ్మె కాలం వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెప్పులు, సబ్బులు, నూనెలు, ఇవ్వాలని తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ పట్టణ ఉపాధ్యక్షులు, యన్నం శివ నాగేశ్వరరావు, కటారి శ్రీనివాస రావు, కటారి పరమేశ్వర రావు, శివరాత్రి అంజిబాబు, ముద్ర బోయిన హను మంతరావు, దాసరి సాంబయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ కోరారు. శనివారం ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుంటూరు ప్రాజెక్టు కమిటీ సమావేశం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ అంగన్వాడీలు గత ప్రభుత్వం హయంలో జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని 42 రోజులు సమ్మె చేస్తే జీతాలు జులైలో పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా హెల్పర్ పోస్టుల ప్రమోషన్లకు సంబంధించి దరఖాస్తు చేసి, ఇంటర్వ్యూకు పిలిచి, ఎన్నికల కోడ్ కారణంగా పోస్టింగ్ ఇచ్చే ప్రక్రియ నిలుపుదల చేశారన్నారు. కావున అటువంటి వారందరికీ వెంటనే పోస్టింగ్స్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీ యూనియన్ గుంటూరు ప్రాజెక్టు కార్యదర్శి టి.రాధా మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. అంగన్వాడి సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కోరారు. ఈ సమావేశానికి ఆరుమళ్ళ నాగేశ్వరి అధ్యక్షత వహించగా, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఓ.రోజమ్మ, వెంకటరమణ, శ్రీదేవి, పద్మ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధ

ఒప్పో ఎఫ్ 27 ప్రో ప్లస్ మార్కెట్లోకి ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఒప్పో ఇండియా ఎఫ్ 27 ప్రో ప్లస్ 5జీ స్మార్ట్ ఫోన్‌ను అత్యాధునిక టెక్నాలజీతో మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ రీజనల్ మార్కెటింగ్ హెడ్ అమర్ కుమార్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని ఒప్పో షోరూమ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివరాలను తెలిపారు. ఒప్పో ఎఫ్ 27 అనేది మొట్ట మొదటి ఐపీ 66, ఐపీ 68, టెక్నాలజీతో రూపొందించారని తెలిపారు. ఒప్పో ఎఫ్ 27 ప్లస్ డస్క్ పింక్, మిడ్‌నైట్ నేవీ అనే రెండు రంగుల్లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. 128 జీబీ స్టోరేజ్ వేరియంట్ ఉందని ఇది రూ.27,999లకు, అలాగే 256 జీబీ వేరియంట్ రూ.29,999లకు లభిస్తుందన్నారు. డ్యామేజ్ ప్రూఫ్ 360 డిగ్రీ ఆర్మర్ బాడీ కలిగి ఉంటుందని ఇది పరికరాన్ని నీటి చుక్కలు, గీతలు నుండి కాపాడుతుందని అన్నారు. నాలుగు సంవత్సరాల మన్నికను అందించే 5000 ఎంఏహెచ్ బ్యాటరీ కూడా ఉందన్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ

విజయవాడ : వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తిరువూరులో 75 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ శనివారం ముగిసింది. చివరి రోజున ప్రజలకు రస్నా పంపిణీ చేసి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వేసవిలో ప్రజలు అల్లా డిపోతున్న క్రమంలో వాసవి క్లబ్ తిరువూరు కమిటీ సభ్యులు జై బావి సెంటర్లో చల్లటి మజ్జిగ పంపిణీ అందజేయటం అభినందనీయమని వాసవి క్లబ్ రీజియన్ నాయకులు కొత్తగుండ్ల ప్రసాద్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాళ్ల వెంకట రామారావు, కృష్ణారావు, సతీష్, చిత్తలూరి లక్ష్మీ, గజ్జల శ్రీదేవి పాల్గొన్నారు.

కక్ష పూరిత రాజకీయాలు తగవు

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి నియోజకవర్గంలో కక్షపూరిత రాజకీయాలు తగవని, ప్రస్తుతం జరుగుతున్న విధ్వంస రాజకీయాలు గతంలో ఎన్నడూ లేవని ఎంటిఎంసి వైసిపి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శనివారం ఎంటిఎంసి వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నా నాయకులం మేమంతా బాగానే ఉంటామని, నష్టపోయేది కార్యకర్తలేనని చెప్పారు. దౌర్జన్యాలకు దిగే వారు, విగ్రహాలు పగలకొట్టే ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇప్పటికైనా హింసాకాండ ఆపాలని కోరారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన పార్టీ ఓడిన పార్టీతో కక్ష పెంచుకోవడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మేకా అంజిరెడ్డి, యు.కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాలలో కొనసాగుతున్న తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు : పురుగు మందుల పరీక్షా కేంద్రం ఎడిఎ సిహెచ్. తిరుమలాదేవి ఆధ్వర్యంలో విత్తన తనిఖీ బృందం తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక పట్నంబజారులోని పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం గోడౌన్‌లోని నిల్వలను లెక్కించారు. సోర్స్ సర్టిఫికెట్ చూపని కారణంగా విజయ శానిటరీ సీడ్స్ షాపులో సుఫల అగ్రిజెనిటిక్స్, నన్‌హెమ్స్ కంపెనీలకు చెందిన రూ.1.99 లక్షల విలువైన 300 ప్యాకెట్ల మిరప విత్తనాల విక్రయాలు నిలుపుదల చేశారు. షోకాజు నోటీసులు కూడా జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఈ తనిఖీలలో గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారి బి.కిషోర్ పాల్గొన్నారు.

చెత్త పన్ను ఉన్నట్లా...లేనట్లా...?

చెత్త పన్ను ఉన్నట్టా...లేనట్టా అని నగర ప్రజల్లో చర్చ జరుగుతోంది. టిడిపి ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాల నుంచి అందిన మౌఖిక ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నుంచి విజయవాడ నగరంలో చెత్త పన్ను వసూలు నిలిచిపోయిందని ప్రజారోగ్య విభాగం అధికారులు వివరిస్తున్నారు. కానీ ఎన్నికల ముందు వరకు కూడా విజయవాడ నగరంలో నెలకు రూ. కోటి 25 లక్షల నుంచి కోటి 27 లక్షల వరకు 64 డివిజన్లలోని 286 సచివాలయాల పరిధిలో శానిటరీ సెక్రటరీల ద్వారా చెత్త పన్నును వసూలు చేసేవారు. చెత్త పన్ను రూపంలో నెలకు కోటిన్నర, ఏడాదికి రూ.18 కోట్లు భారం పడుతుంది. పేదల ఆవాసాల నుంచి నెలకు రూ.60, మధ్యతరగతి ప్రజల నుంచి రూ. 120, వ్యాపార సముదాయాల నుంచి రూ.ఐదు వేల నుంచి 30-40 వేల వరకు నెలకు వసూలు చేస్తున్నారు. నగర వ్యాప్తంగా మూడు లక్షల 28 వేల గృహాల నుంచి చెత్త పన్ను వసూలు చేసే వారు. వీటిల్లో 28 వేల వరకు వ్యాపార సముదాయాలున్నాయి. ఈ ట్రేడర్స్ నుంచే నెలకు సాధారణ రోజుల్లో రూ.70 లక్షలు వసూలు చేసేవారు. గడిచిన ఈ ఎన్నికల నేపథ్యంలో ఆనాటి అధికార వైసిపి ప్రభుత్వం చేసిన సూచన మేరకు పూర్తి స్థాయిలో వసూలు చేయలేకపోయినా 50 శాతం చెత్త పన్నును వసూలు చేశారు. ఈ లెక్కన రూ. 50 లక్షల నుంచి 60 లక్షల వరకు గడిచిన రెండు, మూడు మాసాల్లో వసూలు చేశారు. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన ఈ నెల 4వ తేదీ నుంచి చెత్త పన్ను వసూలును పూర్తి స్థాయిలో నిలుపుదల చేసినట్లు అధికారులు వివరిస్తున్నారు. ఉన్నత స్థాయి నుంచి అందిన మౌఖిక ఆదేశాల మేరకు చెత్త పన్ను వసూలు చేయడం లేదని నగరపాలక సంస్థ అధికారుల నుంచి సమాచారం వినిపిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా శానిటేషన్ నిర్వహణకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్తే నేటికీ కొనసాగుతుంది. 225 క్లాప్ ఆటోలకు గ్యాస్ నింపే దగ్గర నుంచి వాటి మరమ్మతులు, డ్రైవర్లు జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులు మొత్తం కలుపుకొని స్వయంభూ ప్రయివేటు సంస్థకు ముందస్తుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం... విజయవాడ నగరపాలక సంస్థ నెలకు రూ. కోటి 80 లక్షలు చెల్లించాలి (త్రూ సిడిఎంఎ ద్వారా) ఈమేరకు నగరపాలక సంస్థపై భార పడుతుంది. క్లీన్ ఆంధ్రప్రదేశ్

వీక్షణం


పథకంలో భాగంగా గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ఆటోలు మొత్తం నేటికీ నగరంలో నడుస్తున్నాయి. అయితే చెత్త పన్ను తాత్కాలికంగా వసూలును నిలపుదల చేసినా... ఈ క్లాప్ ఆటోలు నిర్వహణ, డ్రైవర్ల వేతనాలకు అయ్యే భారాన్ని అటు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందా...లేదా నగరపాలక సంస్థ బడ్జెట్ నుంచి భరించాల్సి ఉంటుందా అనేది నగరపాలక సంస్థలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోనే ఒక క్లారిటీ లేదని ఉన్నత స్థాయి అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తమ కాంట్రాక్ట్‌ను కొనసాగించే విధంగా అవకాశం కల్పించాలని రాష్ట్ర ఐటి మంత్రి నారాలోకేష్ వద్దకు స్వయంభూ సంస్థ యాజమాన్యం ఇటీవల కొద్ది రోజుల క్రితం వెళ్లి ఆయనను సంప్రదించినట్లు తెలిసింది. దీనిపై మంత్రి నారాలోకేష్ స్పష్టంగా చెప్పకుండానే... త్వరలో ఒక నిర్ణయానికి రావడం జరుగుతుందని, అప్పటి వరకు క్లాప్ ఆటోలను నడుపుకోండని ఆయన చెప్పినట్లు తెలిసింది. అయితే విజయవాడ లాంటి నగరంలో శానిటేషన్ నిర్వహణకయ్యే వ్యయం నగరపాలక సంస్థపై మోయలేని భారం అవుతుందని, ప్రస్తుతం నడుపుతున్న క్లాప్ ఆటోల్లో సగం ఆటోలను తొలగించి, 125 క్లాప్ ఆటోలు, మిగిలిన 20-25 విఎంసి ఆటోలను చెత్త తరలించడానికి, శానిటేషన్ పనికి వినియోగించుకుంటే నగరపాలక సంస్థపై అంత భారం ఉండదనే ఆలోచనను వారు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను రద్దుపై ఒక స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు. అయితే క్లాప్ ఆటోల నిర్వహణకు నగరపాలకసంస్థ స్వయంభూ సంస్థకు మరోనాలుగున్నర కోట్లు బాకీ పడినట్లు అధికారుల నుంచి సమాచారం వినిపిస్తుంది. ఇటువంటి నేపథ్యంలో ప్రజలకు భారమైన చెత్త పన్నును తక్షణమే రద్దు చేసి, ఆ భారాన్ని మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేటట్లు నిర్ణయం చేయాలని పౌరసంఘాలు, పౌర వేదికలు, ప్రజలు కోరుతున్నారు. లేనట్లయితే ప్రజలపై పడే భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వస్తోంది. ఏది ఏమైనా రాష్ట్ర స్థాయిలో ఆయా నగరపాలక సంస్థ కమిషనర్లతో సిఎం చంద్రబాబునాయుడు ఒక సారి రివ్యూ నిర్వహించి, చెత్త పన్ను రద్దుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పక తప్పదు.

- రాజు

ఫాదర్స్ డే సందర్భంగా

గుండ్రాయిపై తండ్రీ కూతుళ్ళ చిత్రం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :



ఫాదర్స్ డే సందర్భం గా పట్టణానికి చెందిన హరీష్ చంద్ర శేఖర్ గుండ్రాయి పై బ్లాక్ మార్కర్ పెన్నుతో తండ్రి కూతుళ్ళ మధ్య ఉండే ఆప్యా యత, అను రాగం తెలియ జేస్తూ తండ్రి కూతుర్ల చక్కని ముచ్చటైన చిత్రాన్ని గీశారు.



విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేసిన పేరకలపాడు సర్పంచ్ మన్నె సాత్విక.విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బెల్ట్‌లతో కూడిన కిట్‌లను గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ సాత్విక మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్యా కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. కంచికచర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సాత్విక తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరకలపాడు సర్పంచ్ సాత్విక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, మిగతా ఉపాద్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై విమర్శలకు ఖండన

ప్రజాశక్తి - విజయవాడ : జగన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని శిశు పాలుడంటూ వ్యాఖ్యానించడాన్ని విజయ వాడ పార్ల మెంట్ కార్యదర్శి, మాజీ ఫ్లోర్ లీడర్ కొట్టేటి హను మంతు రావు ఖండిం చారు. గురు నానక్ కాలనీలోని విజయ వాడ పార్లమెంట్ కార్యాల యం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం మీడియా సమా వేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ గత ఐదేళ్లుగా లెక్కకు మించి పాపాలు చేశారని పేర్కొన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన జగన్ పాపాల లిస్ట్ లెక్కకు అందటం లేదని ఎద్దేవా చేశారు. జగన్ నిరంశుక పాలనపై ఆగ్రహం చెంది అత్యధిక మెజార్టీతో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నారన్నారు.



మాట్లాడుతున్న కొట్టేటి హనుమంతరావు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు : ఎసిపి

ప్రజాశక్తి - నందిగామ : జూన్ 17న శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బక్రీదు నిర్వహించాలని నందిగామ ఇన్‌ఛార్జ్ ఎసిపి స్రవంతిరాయ్ ముస్లింలకు సూచించారు. నందిగామ ఇన్‌ఛార్జి ఎసిపి స్రవంతి రాయ్ ఆధ్వర్యంలో శనివారం ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. నందిగామ టౌన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ నందిగామ టౌన్ ముస్లిం పెద్దలతో నందిగామ పోలీస్ స్టేషన్లో ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతూ జూన్ 17వ తేదీన బక్రీద్ పండుగ పురస్కరించుకుని నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని మసీదుల వద్ద పండగ నేపథ్యంలో మతసామ్రస్యాన్ని పాటించాలని కోరారు. ఇతర మతాలకు ఇబ్బందులు లేకుండా మత ప్రార్థనలను నిర్వహించుకోవాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రార్థనలు నిర్వహించాలని సూచించారు. మసీదు పెద్దలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా మాధ్యమాలలో ఇతర మతాలను రెచ్చగొట్టే విషయాలను గాని లేదా పుకార్లను గాని నమ్మవద్దని అన్నారు. ఎస్ఐలు పండుదోర, దుర్గమహేశ్వారారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎసిపి స్రవంతి రాయ్

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - గంపలగూడెం : కొనిజర్ల గ్రామానికి చెందిన పేరా బత్తుల స్రవంతి (డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న) ఈ నెల 14వ తేదీ తెల్లవారుజాము నుండి కనిపించడం లేదంటూ, స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్రవంతి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.శ్రీనివాస్ వివరించారు.



ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తున్న ఢిల్లీ టీం

వ్యాయామం, మితాహారంతో స్థూలకాయం నివారణ

ప్రముఖ బెరియాట్రిక్ సర్జన్ డాక్టర్ రవికాంత్ కొంగర

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మొదట నుండి వ్యాయామం, మితాహారం, ఆహార నియమాలు పాటించడం ఉంటే స్థూలకాయం సమస్య చాలా అరుదుగా ఉంటుందని ప్రముఖ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ కె.రవికాంత్ అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్ నందు డాక్టర్ సమరం అధ్యక్షతన ' బేరియాట్రిక్ సర్జరీ ' అనే అంశంపై శనివారం ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో స్త్రీ - పురుషులు అనే తేడా లేకుండా ఆరోగ్యానికి స్థూలకాయం ఓ ఛాలెంజ్‌గా మారిందన్నారు. చిన్న పిల్లల్లో కూడా స్థూలకాయం సమస్య ఎక్కువైందని, స్థూలకాయం నివారణలో బెరియాట్రిక్ సర్జరీ అత్యంత ప్రాముఖ్యత చెందిందన్నారు. ప్రతి ఒక్కరికీ దీని గురించి సరైన అవగాహన అవసరం అన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పులతో స్థూలకాయం సమస్యలు అధికంగా పెరిగిపోయాయయని, చిన్న వయసు నుండే వ్యాయామం లేకపోవడంతో స్థూలకాయం సమస్య అధికంగా తలెత్తుతుందన్నారు. స్థూలకాయం అనేక అనర్థాలకు మూలం అని అధిక బరువుతో మధుమేహం, గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్‌కు, కొలెస్ట్రాల్, రక్తపోటు, కిడ్నీ సమస్యలు వంటివి తలెత్తుతాయని అన్నారు.స్థూలకాయంతో తలెత్తే ఆరోగ్య సమస్యలకు బెరియాట్రిక్ సర్జరీ ముఖ్యమైన పరిష్కారమన్నారు. బెరియాట్రిక్ సర్జరీ తరువాత చాలా వరకు ఆసమస్యలు తగ్గిపోతాయన్నారు. క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యశైలి, జీవితకాలాన్ని పెంచుతుందన్నారు. స్థూలకాయం, వల్ల 20 నుండి 30 ఏళ్లకే మృత్యువుని ఆహ్వానించినట్లు అన్నారు. ప్రతి ఒక్కరికీ స్థూలకాయం వల్ల వచ్చే సమసకయలు గురించి తప్పక అవగాహణ ఉండాలన్నారు. డాక్టర్ మారు వందన సమర్పణ చేయగా సదస్సులో పాల్గొన్న పలువురు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



మాట్లాడుతున్న రవికాంత్

ప్రభుత్వాస్పత్రిలో తనిఖీ

ప్రజాశక్తి - గంపలగూడెం: ఎన్ క్యూ ఎఎస్ నేషనల్ ఎస్యురెన్స్ టీం శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసింది. వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో (ఢిల్లీ) టీం ఈ తనిఖీల్లో పాల్గొంది. శనివారం అనుకోకుండా ఆసుపత్రికి చేరుకొని, పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నమోదు తీరు, ఆరోగ్య సిబ్బంది పనితీరు, ఆసుపత్రికి వచ్చి పోవు రోగుల రిజిస్టర్లు తదితర అంశాలను టీం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో డాక్టర్ పి గంగాధర గుణపతి రావు, డాక్టర్ గౌరవ్ తిరుపతి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందిని ఒక దగ్గరకు చేర్చి, ఆసుపత్రి పై తీసుకోవలసిన చర్యలు, చేపట్టాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ శతి, భార్గవిలు పాల్గొన్నారు.